సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం, 6, జూన్, 2025



సేవలకు సెలవంటూ...

10లో


శ్రీకామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి సేవా ప్రస్థానం ముగిసింది. పీఠాధిపతి అస్తమించారన్న వార్త కోనసీమ ప్రజలను విషాదంలో నింపింది.



రూ.లక్ష విరాళం

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నప్రసాద భవన నిర్మాణానికి చంద్రదిలీప్ కుమార్ దంపతులు (విజయవాడ తాడిగడప) రూ.1,00,116 విరాళం అందజేశారు.

కడలిలోకి 15,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 15,700 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 200, మధ్య డెల్టాకు 100, పశ్చిమ డెల్టాకు 200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

జిల్లావ్యాప్తంగా 4 లక్షల మొక్కలు నాటుతాం



మొక్కలు నాటుతున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లావ్యాప్తంగా 4 లక్షల మొక్కలు నాటుతామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యాన స్థానిక ఆర్ట్స్ కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాటిన మొక్కలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని కోరారు. ప్లాస్టిక్ మంచిది కాదనే విషయం తెలిసిన రోజున ఎవరికి వారే దీని వినియోగం తగ్గించుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. అటవీ శాఖ చీఫ్ కన్సర్వేటర్ మూర్తి మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగంతో మనకు తెలియకుండానే శరీరంలో మైక్రో ప్లాస్టిక్ వ్యర్థాలు రక్తంలో కలిసిపోతున్నాయని తెలిపారు. వెయ్యి మందికి రక్త పరీక్షలు నిర్వహించగా 80 శాతం మందిలో మైక్రో ప్లాస్టిక్ ఉన్నట్లు గమనించారన్నారు. మైక్రో ప్లాస్టిక్ ఉన్న వారిలో 25 శాతం మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలును సందర్శించిన అటవీ అధికారులు



జైలులో వందేళ్లకు పైబడిన చెట్టును పరిశీలిస్తున్న అటవీ అధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ ఎస్ఎస్ఎన్ మూర్తి, డివిజనల్ ఫారెస్ట్ అధికారి ఫణీంద్ర ధర్మ గురువారం సందర్శించారు. జైలులోని నర్సరీ గురించి వారికి కారాగార పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ వివరించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం కారాగారానికి బయో డైవర్సిటీ పురస్కారం అందజేసిందని చెప్పారు. వందేళ్ల వయస్సుకు పైబడిన వృక్షాలను అటవీ శాఖ అధికారులకు ఆయన చూపించారు. కారాగారంలో నర్సరీని అభివృద్ధి చేసిన జైలు అధికారులను అటవీ అధికారులు ప్రశంసించారు. అనంతరం కారాగారంలోని పరేడ్ మైదానంలో మొక్కలు నాటారు.

కార్మిక శాఖ సహాయ కమిషనర్‌గా శ్రీనివాస్ మహేష్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కార్మిక శాఖ కాకినాడ సహాయ కమిషనర్‌గా పి.శ్రీనివాస్ మహేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలో కార్మిక శాఖ కమిషనర్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై కాకినాడ వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఎస్.బుల్లిరాణి కొవ్వూరు బదిలీ అయ్యారు.

ఆడబిడ్డకు దగా



సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

- కూటమి పాలనలో మాయమైన మహిళా సంక్షేమం
- ఆడబిడ్డ నిధి కోసం నిరీక్షణ
- కొందరికే ఉచిత గ్యాస్
- అందని ఫ్రీ బస్సు

సాక్షి, రాజమహేంద్రవరం: మహిళలను మహారాణుల్ని చేస్తామన్నారు.. ఉచిత బస్సుతో ఎక్కడికైనా తిరగవచ్చన్నారు.. డ్వాక్రా సంఘాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తామన్నారు.. ఇంకా 18 నుంచి 59 ఏళ్ల వయసున్న మహిళలకు నెలకు రూ.1,500, తల్లికి వందనం, డ్వాక్రా రుణ పరిమితి రెట్టింపు ఇలా.. అనేక అడ్డగోలు హామీలిచ్చి అతివల ఓట్లు వేయించుకున్నారు. గద్దెనెక్కాక ఆ హామీలు అమలు చేయకుండా ఆడబిడ్డలను అడుగడుగునా దగా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఒక్క పథకం కూడా అమలు చేయలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి పాలనలో అన్యాయం

- ఆడబిడ్డ నిధి పేరుతో 19 నుంచి 59 ఏళ్ల వయసున్న మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఆర్థిక సాయం అందిస్తామని గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పెద్దలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఈ హామీకి అతీగతి లేదు. ఎప్పుడిస్తారన్న స్పష్టత కూడా లేదు. జిల్లావ్యాప్తంగా 19 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు సుమారు 6 లక్షల మంది ఉన్నారు. వీరందరూ ఆడబిడ్డ నిధి కోసం వేచి చూస్తున్నారు. ఇప్పటికే ఏడాది కాలంలో సుమారు రూ.90 కోట్లు నష్టపోయారు.
- అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తామని కూటమి పెద్దలు చంద్రబాబు అండ్ కో హామీ ఇచ్చారు. ఏడాదవుతున్నా దీనికి అతీగతి లేదు. ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామని చెబుతున్నా.. దీనిపై ఇప్పటి వరకూ ఎటువంటి విధివిధానాలూ రాలేదు. అధ్యయనాల పేరుతో ఏడాది గడిపేశారు. ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించేందుకు సుమారు 6.60 లక్షల మంది మహిళలు ఎదురు చూస్తున్నారు.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరిట చదువుకునే పిల్లలందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. ప్రతిపక్షం పోరాటాల ఫలితంగా దీనిని ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తామని చెబుతున్నారు. అయితే ఎవరికిస్తారు.. అర్హులెవరు.. అందరికీ ఇస్తారా.. ఒక విద్యార్థికే పరిమితం చేస్తారా.. అనే మార్గదర్శకాలపై స్పష్టత ఇవ్వడం లేదు. కొద్ది రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నప్పటికీ దీనిపై స్పష్టత ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 1.70 లక్షల తల్లులు తల్లికి వందనం పథకం కోసం ఎదురు చూస్తున్నారు.

ఉచిత గ్యాసే..!

ఉచిత వంట గ్యాస్ పథకంపై కూటమి ప్రభుత్వం నిబంధనల 'బండ' వేసింది. సార్వత్రిక ఎన్నికల ముందు ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక కొర్రీలు వేస్తున్నారు. అందరికీ కాకుండా కొందరికే దీనిని పరిమితం చేసేందుకు సవాలక్ష నిబంధనలు తెర పైకి తెచ్చారు. తొలుత దీపం పథకం ద్వారా గ్యాస్ పొందిన వారికే వర్తిస్తుందన్నారు. అనంతరం రేషన్ కార్డు కలిగిన వారికి మినహాయింపు ఇచ్చారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, మొబైల్ నంబర్‌కు లింక్ అయి ఉంటే మాత్రమే ఇస్తామని మరో నిబంధన తీసుకురావడంతో పూర్తి స్థాయిలో ఉచిత గ్యాస్ అందని పరిస్థితి. జిల్లావ్యాప్తంగా 3 ప్రధాన కంపెనీలు, 36 ఏజెన్సీల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతోంది. మొత్తం 6,24,265 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో డబుల్ కనెక్షన్లు మినహాయిస్తే మిగిలినవి 4,09,734 ఉన్నాయి. తెల్లరేషన్ కార్డులు 5,42,964, అంత్యోదయ 21,591 కలిపి మొత్తం 5,64,555 ఉన్నాయి. రేషన్ కార్డు నిబంధనతో జిల్లాలోని 1,54,821 మందికి ఉచిత గ్యాస్ అందే పరిస్థితి లేకుండా పోయింది.

కొవ్వూరు మండలం కాపవరంలో సుందరంగా తయారైన జగనన్న కాలనీ



జగన్ హయాం.. మహిళాభ్యుదయం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేశారు. సంక్షేమ పథకాలన్నీ వారి పేరిటే అందించారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి, రాజకీయాల్లో మహిళల స్థానాన్ని పెంపొందించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అన్నివిధాలా సహకరించారు.

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 84,593 స్వయం సహాయక సంఘాలకు రూ.15,969.85 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందజేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.
- వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా 73,993 మందికి రూ.401.28 కోట్ల ఆర్థిక సాయం అందించారు.
- వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 33,498 స్వయం సహాయక సంఘాలకు రూ.145.94 కోట్ల వడ్డీ మంజూరు చేశారు.
- వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా 27,417 స్వయం సహాయక సంఘాలకు రూ.728.9 కోట్ల రుణాలు మాఫీ చేశారు.
- 81,141 మంది మహిళలకు రూ.374.58 కోట్ల స్త్రీనిధి రుణాలు అందించారు.
- ఈబీసీ నేస్తంలో భాగంగా కమ్మ, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య తదితర కులాలకు చెందిన 16,218 మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఏడాదికి రూ.24.32 కోట్లు అందజేశారు.
- వైఎస్సార్ కాపు నేస్తం పథకంలో కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాలకు చెందిన మహిళలు 824 మందికి ఏటా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఏడాదికి రూ.44.73 కోట్ల ఆర్థిక సాయం చేశారు. ఇలా నాలుగేళ్ల పాటు అందించారు. ప్రస్తుతం ఈ వర్గాల మహిళలను పట్టించుకున్న వారే లేరు.

మహిళల పేరిటే ఇళ్ల స్థలాలు

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ స్థలంతో పాటు పక్కా ఇళ్లు నిర్మించేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇంటి పట్టాలు సైతం మహిళల పేరు మీదనే అందించింది. జిల్లా వ్యాప్తంగా 431 లేఅవుట్లలో 65,075 ఇళ్లు మంజూరు చేసింది. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో 47,053 ఇళ్లు, ప్రైవేటు స్థలాల్లో 18,022 ఇళ్ల నిర్మాణాలకు నాంది పలికారు.

'దిశ'కు ఇక్కడి నుంచే శ్రీకారం

అతివలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టేందుకు, వారికి అండగా నిలిచేందుకు గత ప్రభుత్వం 'దిశ' పేరిట ప్రత్యేక వ్యవస్థను తీసుకు వచ్చింది. మహిళలు తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పేందుకు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కకుండా పోలీసులే వారి చెంతకు వెళ్లి అండగా నిలిచి సాయం అందించేలా ఈ వ్యవస్థను రూపొందించింది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాజమహేంద్రవరంలో 2020లో దిశ మహిళా పోలీస్ స్టేషన్‌ను నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ప్రారంభించారు. దీని ద్వారా ఫోన్ చేసిన నిమిషాల వ్యవధిలోనే బాధితురాలికి పోలీసుల సాయం అందేది. ప్రస్తుతం ఈ వ్యవస్థను నిర్వీర్యం చేశారు.



మహిళా మార్ట్‌తో ఆసరా

డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు 'జగనన్న మహిళా మార్ట్' పేరుతో వ్యాపార సముదాయాలను గత ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఇందులో మహిళలే షేర్ హోల్డర్లుగా వ్యవహరించే వెసులుబాటు కల్పించింది. జిల్లావ్యాప్తంగా 30,832 స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటిలో 3,08,430 మంది సభ్యులున్నారు. మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయడం ద్వారా ఖర్చులు పోను నెలకు రూ.45 వేల వరకూ డ్వాక్రా సంఘాలకు ఆదాయం లభించేలా నాటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.



నిడదవోలులో మహిళా మార్ట్ (ఫైల్)

పాప ప్రాణం తీసిన విద్యుత్ వైర్లు

ధవళేశ్వరం: అప్పటి వరకూ ఇంటి బయట ఆడుతున్న పాప ఒక్కసారిగా ఊహించని విధంగా జరిగిన ప్రమాదంతో విగత జీవిగా మారింది. ధవళేశ్వరం బస్టాండ్ వెనుక ప్రాంతానికి చెందిన పాతూరి అక్షర (9) గురువారం ఉదయం ఆడుకుంటోంది. అక్కడే ఉన్న చెట్టు కొమ్మ ఉన్నట్టుండి ఒక్కసారిగా విరిగింది. దాంతోపాటు విద్యుత్ వైర్లు కూడా తెగి పడటంతో ఆ చిన్నారి ఒక్కసారిగా షాక్‌కు గురై, తీవ్రమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. అక్షరతో పాటు అక్కడే ఆడుకుంటున్న మరో చిన్నారి దేవదాసి లిషిత తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. అప్పటి వరకూ ఇంటి ముందు ఆడుకుంటున్న తమ కుమార్తె విగత జీవిగా మారడంతో ఆ తల్లిదండ్రుల గుండెలు పగిలేలా రోదించారు. చుట్టుపక్కల వారు కంట తడి పెట్టుకున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ సంఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి.





విరిగి పడిన చెట్టు కొమ్మ, తెగిపడిన విద్యుత్ వైర్లు (అంతరచిత్రం) అక్షర (పాతచిత్రం)

నేటి నుంచి డీఎస్సీ

రాజమహేంద్రవరం సిటీ: జిల్లావ్యాప్తంగా డీఎస్సీ–25 పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు జిల్లాలో 3,977 మంది హాజరు కానున్నారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారులతో తన చాంబర్‌లో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో ఈ నెల 6, 9, 12, 13, 23, 24 తేదీల్లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. స్థానిక లూథర్‌గిరిలోని అయాన్ డిజిటల్ కళాశాలలో ఈ నెల 6న 600 మంది, 9న 600 మంది, 12న 596 మంది, 13న 960 మంది, 23న 960 మంది, 24న 301 మంది డీఎస్సీ పరీక్షలకు హాజరు కానున్నారని వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించాలని, కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, ఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్ కుమార్, ఆర్టీసీ డీఎం షబ్నం తదితరులు పాల్గొన్నారు.

చేప ముల్లు తీసి.. ప్రాణం నిలిపి..



శస్త్రచికిత్స చేసి తీసిన చేపముల్లు



మంగాయమ్మతో వైద్యులు

కాకినాడ క్రైం: గుండె రక్తనాళానికి చేప ముల్లు గుచ్చుకొని ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ మహిళ ప్రాణాలను కాకినాడ వైద్యులు రక్షించారు. సంబంధిత వివరాలను కాకినాడ అపోలో ఆసుపత్రి యాజమాన్య గురువారం వెల్లడించింది. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన మహిళ జంప మంగాయమ్మ (54) ఫోన్ మాట్లాడుతూండగా గుండె నొప్పికి గురైంది. ఆమెను కుటుంబ సభ్యులు గత నెల 25వ తేదీన కాకినాడ అపోలో ఆసుపత్రిలో చేర్చారు. వైద్యులు పరీక్షించి గుండె రక్తనాళానికి చేప ముల్లు గుచ్చుకొని ఉందని తేల్చారు. ఆమెను రక్షించేందుకు ఛాతికి అత్యంత అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ సర్జరీ చేయడానికి 12 గంటల సుదీర్ఘ సమయం పట్టింది. ఇది దేశంలోనే అత్యంత అరుదైన శస్త్రచికిత్స అని వైద్యులు తెలిపారు. వైద్య బృందానికి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ గూడె వంశీ చైతన్య, వాస్క్యులర్ సర్జన్ కృష్ణ, గుండె మత్తు వైద్య నిపుణుడు ప్రగడ నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు.

ఆమెపై కక్ష గట్టి..

- మహిళా ఐఏఎస్‌కు వ్యతిరేకంగా నేతల 'కూటమి'
- కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ బదిలీకి యత్నం
- అంతా ఒక్కటై.. బదిలీకి వారం డెడ్‌లైన్
- అధిష్టానానికి అల్టిమేటం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఒక మహిళా ఐఏఎస్‌పై కూటమి నేతలు కక్ష కట్టారు. ఆమెను సాగనంపేందుకు తమ మధ్య ఉన్న విభేదాలన్నింటినీ పక్కన పెట్టి ఒక్కటయ్యారు. బిల్లుల కోసం వచ్చి, గద్దించి మాట్లాడిన టీడీపీ నేత కుమారుడిపై పోలీసులకు ఫిర్యాదు చేయడమే ఆమె చేసిన పెద్ద నేరమైంది. ఆమెను కొనసాగించవద్దని అందరూ పట్టుబడుతున్నారు. దీని కోసం జిల్లా టీడీపీలో సీనియర్ నాయకులందరూ అంతర్గతంగా ప్రత్యేక అత్యవసర సమావేశం కూడా ఏర్పాటు చేశారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన బదిలీ కోసం కూటమి కట్టిన నేతల తీరు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

టీడీపీ నేత పుత్రరత్నం దుందుడుకు వ్యవహారం

ప్రజాసంబంధాలతో ముడిపడి ఉన్న ఐఏఎస్ అధికారులు.. ఏ హోదాలో ఉన్నా ఏ విషయంపైనైనా సమయస్ఫూర్తితో వ్యవహరించాల్సిందే. అందునా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల వేదికలో మరింత జాగరూకతగా ఉండాల్సిన బాధ్యత ఉంటుంది. నాలుగున్నర లక్షల పైచిలుకు జనాభా కలిగిన కాకినాడ నగర పాలక సంస్థకు మహిళా ఐఏఎస్ భావన కమిషనర్‌గా పని చేస్తున్నారు. ఆమె కాకినాడ వచ్చి ఇంకా ఏడాది కూడా పూర్తి కాలేదు. ప్రతి వారం మాదిరిగానే గత సోమవారం ఆమె ప్రజా ఫిర్యాదుల వేదికలో అర్జీలు స్వీకరిస్తున్నారు. ఆ క్రమంలో కమిషనర్ వద్దకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు తనయుడు, కాంట్రాక్టర్ అయిన గంగాధర రమేష్ వచ్చారు. అధికార పార్టీకి చెందిన కీలక నాయకుడి తనయుడిని కావడంతో తన మాటకు ఎదురుండదనుకున్నారో ఏమో కానీ.. పెండింగ్ బిల్లుల కోసం దుందుడుగా ప్రశ్నించారు. తాము చెప్పినట్టే అధికారులు, సిబ్బంది నడచుకోవాలనే మనస్తత్వాన్ని చంద్రబాబు దగ్గర నుంచి క్షేత్ర స్థాయిలో నేతల వరకూ అందరూ ఒంట పట్టించుకున్నట్టు ఈ సంఘటనతో అర్థమవుతోంది. బిల్లులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని గంగాధర రమేష్ గద్దించి మాట్లాడటంతో మనస్తాపం చెందిన కమిషనర్ భావన.. దీనిపై అదనపు ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్‌కు మొబైల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు రమేష్‌ను ఆయన ఇంటి నుంచి బలవంతంగా లాక్కుని రావడంతో టీడీపీ నేతల అహం దెబ్బ తిందని అంటున్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయం



భావన, కమిషనర్, నగరపాలక సంస్థ

బిల్లుల విషయం పక్కన పెట్టి.. బదిలీపై పట్టుబట్టి..

తమ పార్టీ నాయకుడి తనయుడి పైనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టీడీపీ నాయకుల అహం దెబ్బ తిన్నట్టుంది. ఈ నేపథ్యంలో వారు బిల్లుల విషయాన్ని పక్కన పెట్టేసి, కమిషనర్ భావనను తక్షణం బదిలీ చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఈ విషయంపై తాడోపేడో తేల్చేస్తామంటూ రచ్చరచ్చ చేస్తున్నారు. ఎంహెచ్ఓ ద్వారా పోలీసులకు కమిషనర్ ఫిర్యాదు చేయడంపై కూటమి ఎమ్మెల్యేలు కాకినాడలో అంతర్గతంగా భేటీ అయ్యారు. ఇది చర్చనీయాంశమైంది. మెట్ట ప్రాంతానికి చెందిన ఒక కీలక ప్రజాప్రతినిధి కనుసన్నల్లో సాగిన ఈ భేటీలో కమిషనర్ భావనను కాకినాడ నుంచి సాగనంపాల్సిందేనని ఎమ్మెల్యేలు ఉన్నతాధికారులకు అల్టిమేటం ఇచ్చారని సమాచారం. దీనికి వారం రోజులు డెడ్‌లైన్ పెట్టినట్లు తెలిసింది. మెట్ట ప్రాంత నేతలకు కాకినాడ సిటీ, రూరల్ నేతలు కూడా తోడయ్యారని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

అడ్డగోలు పనులకు అడ్డమని...


వాస్తవానికి కమిషనర్ భావన, కాకినాడ సిటీ టీడీపీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మధ్య ఆరు నెలల క్రితమే పలు అంశాల్లో విభేదాలు వచ్చాయి. అప్పటి నుంచీ నగరంలో ఏ అధికారిక కార్యక్రమంలోనూ ఇద్దరూ కలిసి పాల్గొన్న దాఖలాలు లేవు. కాకినాడ దుమ్ములపేటలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ శంకుస్థాపనకు ఎమ్మెల్యే కొండబాబు చివరి నిమిషంలో డుమ్మా కొట్టేశారు. వీరిద్దరి మధ్య విభేదాల విషయం తెలియక రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ వచ్చినప్పటికీ.. కొండబాబు రాలేదని తెలిసి తిరిగి వెళ్లిపోయారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్‌కు మాత్రమే కుర్చీ వేసి, ఎమ్మెల్యేని విస్మరించారంటూ అప్పట్లో కొండబాబు వర్గీయులు బయట రచ్చరచ్చ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అయినప్పటికీ ఇప్పటి వరకూ ఎమ్మెల్యే, కమిషనర్ కలసి అధికారులతో ఒక్క సమావేశం కూడా నిర్వహించిన దాఖలాలు లేవు. కార్పొరేషన్ కమిషనర్‌గా వచ్చిన తరువాత అధికార పార్టీ నేతలు చెప్పే అడ్డగోలు పనులకు భావన అడ్డు తగులుతూండటం టీడీపీ నేతలకు కంటగింపుగా మారింది. అయితే, అప్పట్లో ఆమెపై చర్యలకు సిఫారసు చేసేందుకు ధైర్యం చాలక కాకినాడ సిటీ టీడీపీ నేతలు కిమ్మనకుండా ఉండిపోయారు. ఇటీవల మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ కాకినాడ వచ్చిన సందర్భంలో సైతం టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు కమిషనర్ భావనను మార్చాల్సిందేనని పట్టుబట్టారని ప్రచారం జరిగింది. తాజా ఘటనతో జిల్లాలోని టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులందరూ కూటమి కట్టి, కమిషనర్ బదిలీకి పావులు కదుపుతున్నారు. పట్టుమని పది నెలలు కూడా కాకుండానే ఆమెను సాగనంపేందుకు చేస్తున్న ప్రయత్నాలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.

ఇదేం పద్ధతి?

వాస్తవానికి కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు అనేది ప్రభుత్వం వద్దనే పెండింగ్‌లో ఉంది. ఈ చెల్లింపులు సీఎంఎఫ్ పరిధిలో ఉన్నాయి. అధికారం గుప్పిట్లో ఉందని జబ్బలు చరుచుకునే అధికార పార్టీ నేతలు ఉన్నత స్థాయిలో బిల్లులు మంజూరయ్యేలా ప్రయత్నించుకోకుండా కమిషనర్‌పై దుందుడుకుగా మాట్లాడితే ప్రయోజనమేమిటని, ఫిర్యాదు చేయడానికి వచ్చి, ఒక మహిళా ఐఏఎస్‌పై అంత దురుసుగా మాట్లాడటం సమంజసమా అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. అధికారం చేతిలో ఉందనే అహంకారంతో ఏం చేసినా చెల్లుతుందనే తెగింపుతోనే ఇలా వ్యవహరించారని అంటున్నారు. ఈ ఉదంతంలో కమిషనర్ భావన అదనపు ఎస్పీకి ఫిర్యాదు చేయడంలో తప్పేముందని ఉద్యోగ సంఘాలు నిలదీస్తున్నాయి. బిల్లుల మంజూరులో కమిషనర్ వైఫల్యం ఏమైనా ఉంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే అవకాశం ఉందని, అయినప్పటికీ దుందుడుకుగా మాట్లాడాల్సిన పనేమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీల్లో కార్టూనిస్ట్ శేఖర్‌కు బహుమతి



బహుమతి పొందిన కార్టూన్



కార్టూనిస్ట్ శేఖర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఛత్తీస్‌గఢ్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ బోర్డ్, కార్టూన్ వాచ్ పత్రికల సంయుక్త నిర్వహణలో జాతీయస్థాయిలో నిర్వహించిన కార్టూన్ పోటీల్లో నగరానికి చెందిన కార్టూనిస్ట్ శేఖర్ తృతీయ బహుమతి సాధించారు. నిర్వాహకులు త్రియంబక్ శర్మ గురువారం ఆ వివరాలను వెల్లడించారు. ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్, బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో విజేతలకు నగదు బహుమతితోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేయనున్నారు. బహుమతి పొందిన కార్టూన్లను నగర కూడళ్లలో హోర్డింగ్స్, వాల్‌పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది.

అనాథ శవానికి అంత్యక్రియలు



కొత్తపేటలో అనాథ శవాన్ని మోసుకెలుతున్న సలాది చిన్ని తదితరులు



మృతుడు నాగేశ్వరరావు (ఫైల్)

కొత్తపేట: అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు స్థానిక యువకులు. పోలిశెట్టి నాగేశ్వరరావు (82) అనే సాధువు గురువారం స్థానిక కార్పొరేషన్ సత్రం అరుగుపై చనిపోయాడు. కాపు నాయకుడు సలాది రామమోహనరావు (చిన్ని) ఆధ్వర్యంలో యువకులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు నాగేశ్వరరావు కొత్తపేటలో 50 సంవత్సరాల నుంచి సాధువుగా భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛను మంజూరైంది. ఉష్ణోగ్రతలు పెరగడంతో వడదెబ్బ తగిలి మృతి చెందాడు. అంత్యక్రియల్లో పాయసం సతీష్, సలాది బాబి, సలాది నాని పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోరుకొండ: మండలంలోని గాదరాడ పుష్కర కాలువ వద్ద ప్రమాదవశాత్తూ పడిపోయిన గెద్దాడ సురేష్ (33) హాస్పిటల్‌లో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. గండేపల్లి మండలం మురారికి చెందిన సురేష్ బుధవారం పుష్కర కెనాల్ వద్ద పడిపోయాడు. అతన్ని రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్టు కోరుకొండ ఏఎస్సై రంగారావు తెలిపారు. మృతుడు సురేష్‌కు భార్య, చిన్నపిల్లాడు ఉన్నారు, రాజమహేంద్రవరం ఐరెన్‌షాపులో భార్యభర్తలిద్దరూ పనిచేస్తున్నారు.

సేవలకు సెలవంటూ...

- శ్రీకామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి అస్తమయంతో కోనసీమలో విషాదం
- అనాథలను అక్కున చేర్చుకున్న మానవతావాది
- అన్నార్తుల ఆకలి తీర్చిన దాన శీలి
- చిందాడగరువు, హంసవరంలో ఆలయాల నిర్మాణం
- పీఠంలో నిత్యం పూజా కార్యక్రమాలు
- మూడు పర్యాయాలు కంచి కామకోటి పీఠాధిపతుల రాక



కామాక్షీ పీఠం ప్రేమ మందిరంలోని అనాథ పిల్లలతో పీఠాధిపతి కామేశ మహర్షి (ఫైల్)

అమలాపురం టౌన్: శ్రీకామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి (88) సేవా ప్రస్థానం ముగిసింది. మానవ సేవే మాధవ సేవ అనే భావనతో ఆయన జీవితాంతం నడిచారు. పీఠాధిపతి అస్తమించారన్న వార్త కోనసీమ ప్రజలను విషాదంలో నింపింది. ఆరు నెలలుగా అస్వస్థతగా ఉన్న ఆయన గురువారం తెల్లవారు జాము 3.30 గంటలకు పీఠంలోనే తుది శ్వాస విడిచారు. పీఠాధిపతి ఆజన్మాంతం బ్రహ్మచారిగానే ఉండి సమాజానికి సేవలు అందించారు. ఈయన స్వగ్రామం తుని సమీపంలోని హంసవరమైనప్పటికీ అమలాపురంలో పుట్టి పెరగడంతో పట్టణంలోనే పీఠాన్ని ఏర్పాటు చేశారు. 1938 ఏప్రిల్ 2న జన్మించారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో డిగ్రీ, మద్రాసు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో ఏఎంఐఈ చదివారు. ఈయన అసలు పేరు బెహరా యర్రంరాజు. పీఠాధిపతి అయ్యాక కామేశ మహర్షి అయ్యారు.

1967లో పీఠం ఏర్పాటు

అమలాపురంలోని కృష్ణారావు వీధిలో శ్రీకామాక్షీ పీఠాన్ని 1967లో స్థాపించారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకరాచార్య జయేంద్ర సరస్వతీ స్వామి అనుగ్రహం, ఆశీస్సులతో కామేశ మహర్షి పీఠాధిపతి అయ్యారు. కామేశ మహర్షి కంచి కామకోటి పీఠానికి అనేక సార్లు వెళ్లడమే కాకుండా జయేంద్ర సరస్వతీ స్వామీజీని అమలాపురం పీఠానికి 1976, 1996 సంవత్సరాల్లో తీసుకుని వచ్చారు. రెండేళ్ల క్రిందట కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ స్వామీజీని పీఠానికి తోడ్కొని వచ్చి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ పీఠాధిపతుల ఆశీర్వాదాలతోనే కామాక్షీ పీఠం ప్రస్థానం సాగింది. కామాక్షీ పీఠం ట్రస్ట్‌ను స్థాపించి కార్యవర్గం ఆధ్వర్యంలో సేవలు కొనసాగించారు.



పీఠాధిపతి కామేశ మహర్షి పార్థివ శరీరం



అమలాపురంలోని కామాక్షీ పీఠానికి వచ్చిన కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామీజీకి స్వాగతం పలుకుతున్న కామేశ మహర్షి (ఫైల్)

అనాథ పిల్లల కోసం ప్రేమ మందిరం

1996 సంవత్సరంలో పెను తుపానుతో కోనసీమలో ప్రాణ నష్టం భారీగా జరిగింది. తుపానులో వందలాది మంది మృత్యువాత పడినప్పుడు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలను చూసి పీఠాధిపతి చలించారు. ఈ క్రమంలో అదే సంవత్సరం పీఠంలోనే అనాథ పిల్లల ఆశ్రమం పేరుతో ప్రేమ మందిరం నెలకొల్పారు. వరసకు సోదరి అయిన వక్కలంక వాణికి ఆ ప్రేమ మందిరం అమ్మగా బాధ్యతలు అప్పగించారు. కన్న బిడ్డల కంటే ఎక్కువగా ప్రేమ మందిరం అమ్మ వాణి అనాథలను చూసుకుంటున్నారు. ఇన్నేళ్లలో ప్రేమ మందిరంలో దాదాపు 600 మంది అనాథ పిల్లలు ఆశ్రమం పొందారు. అనాథ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి వారు ప్రయోజకులు అయ్యేలా చేశారు. సుమారు 50 అనాథ ఆడ పిల్లలకు యుక్త వయస్సు వచ్చాక పెళ్లిళ్లు చేసి మెట్టింటికి పంపించారు. ప్రస్తుతం 60 మంది అనాథలు ఆశ్రయం పొందుతున్నారు.

సేవలు అనంతం

కామేశ మహర్షి ఇటు పీఠంలోనే కాకుండా అనేక గ్రామాల్లో తన సేవలను కొనసాగించారు. పీఠంలో నిత్యం పూజాదికాలు నిర్వహించారు. కార్తిక, శ్రావణ, మాఘ మాసాల్లో మహిళలతో సామూహిక పూజలు చేయించేవారు. అన్నదానం అంటే ఆయనకు అమితమైన ఇష్టం. గ్రామాల్లో అనేక అన్నదానాలు నిర్వహించారు. అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి గ్రామంలో గోశాలను నెలకొల్పి 60 గోవులకు ఆశ్రయం కల్పించారు. తుని సమీపంలోని హంసవరంలో శ్రీకామాక్షీ ఆలయాన్ని, అమలాపురం రూరల్ మండలం చిందాడగరువులో అమలేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. దానికి అనుబంధంగా చిందాడ మడుగులో వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు చేసేలా ఏర్పాట్లు చేశారు.

ఎన్నెన్నో పురస్కారాలు

కామేశ మహర్షి తన సేవా ప్రస్థానంలో పలు సంస్థల నుంచి ఎన్నెన్నో పురస్కారాలు అందుకున్నారు. మద్రాసు అకాడమి నుంచి ఉగాది పురస్కారం, రాజీవ్ విజ్ఞాన్ పురస్కారం, అల్లూరి స్మారక పురస్కారం, సహస్రాబ్ది పురస్కారం, శతాబ్ది సేవా పురస్కారం, ఎన్టీఆర్ స్మారక ట్రస్ట్ నుంచి జాతీయ పురస్కారం, అక్షర నీరాజన పురస్కారం, ప్రభుత్వం నుంచి సేవా పురస్కారాలను అందుకున్నారు.

నేడు అంత్యక్రియలు

కామేశ మహర్షి పార్థివ దేహానికి పీఠంలోనే శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించేందుకు పీఠం ట్రస్ట్ బోర్డు నిర్ణయించింది. కామేశ మహర్షి జీవించి ఉండగానే తన అంత్యక్రియలు పీఠంలోనే జరగాలని ప్రదేశాన్ని కూడా సూచించారు. ఆయన సూచనల మేరకే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్తరాధికారి రాఖీ ప్రేమ్ తదుపరి పీఠాధిపతి

పీఠాధిపతి కామేశ మహర్షి శివైక్యం కావడంతో ప్రస్తుతం పీఠం ఉత్తరాధికారిగా ఉన్న బాల బ్రహ్మచారి వికానస రాఖీ ప్రేమ్‌ను తదుపరి పీఠాధిపతిని చేసేందుకు కామాక్షీ పీఠం ట్రస్ట్ బోర్డు నిర్ణయానికి వచ్చింది. ఇంత కాలం పీఠం ట్రస్ట్‌కు అధిపతిగా ఉన్న కామేశ మహర్షి స్థానే ప్రేమ మందిరం అమ్మ, వరసకు ఆయన సోదరి వక్కలంక వాణి బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రేమ మందిరంలో పెరిగి పెద్ద అయిన, పీఠాధిపతి ప్రియశిష్యుడు మద్రి దుర్గారావు ఎప్పటిలాగే పీఠం మేనేజర్ బాధ్యతలు నిర్వహిస్తారు.

గాయత్రీ మాతకు 1,008 మామిడి పండ్లతో అభిషేకం



మామిడి పండ్లతో గాయత్రీ మాత

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన వద్ద గల వేదమాత గాయత్రీ దివ్య భవ్య సాధన మందిరంలో అమ్మవారికి 1,008 మామిడి పండ్ల అభిషేకం గురువారం కనుల పండువగా జరిగింది. గాయత్రీ మాత జయంతి సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకూ మందిరం నిర్మాణకర్తలు ఆకుల బాబి, శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో ఈ పూజాదికాలు జరిగాయి. మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన నిర్వహించారు. గాయత్రీ మాత జయంతి సందర్భంగా మందిర ప్రాంగణంలో పిల్లల నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

స్వామివారి పెళ్లికి అంకురార్పణ

కల్యాణ తిలకం దిద్దుకున్న బాలబాలాజీ



సహస్ర కలశారాధన పూజల్లో పాల్గొన్న ఈఓ సత్యనారాయణరాజు దంపతులు

మామిడికుదురు: జ్యేష్ఠ శుద్ధ దశమి శుభ ముహూర్తంలో వేద మంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణలు, మంగళ వాయిద్యాలు, కర్పూర పరిమళ సుగంధ ద్రవ్యాల నడుమ శ్రీబాలబాలాజీ స్వామి తిరు కల్యాణోత్సవాలకు గురువారం అంకురార్పణ జరిగింది. పాంచరాత్ర ఆగమానుసారం శ్రీబాల బాలాజీ స్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

ఆలయ ఉప ముఖ్య అర్చక గొడవర్తి శ్రీనివాసాచార్యులు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి వారి శిష్యులు యాజ్ఞిక బ్రహ్మ చలమచర్ల వేణుగోపాలాచార్యులు బృందం ఆధ్వర్యంలో శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. బాల బాలాజీ స్వామితో పాటు శ్రీదేవి, భూదేవిలను చూడముచ్చటగా అలంకరించారు. బుగ్గన చుక్క పెట్టి, నుదుటన కల్యాణం తిలకం దిద్ది పెండ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా ముస్తాబు చేశారు.



స్వామి, అమ్మవార్ల బుగ్గన కల్యాణ తిలకం దిద్దుతున్న అర్చకుడు



స్వామి, అమ్మవార్లకు సహస్ర కలశాభిషేక సేవ

ఎటువంటి ఆటంకాలు కలుగకుండా స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని కోరుతూ విష్వక్సేనారాధన కార్యక్రమాన్ని ఘనంగా జరిపించారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు 108 కలశాలతో పాటు బ్రహ్మ కలశంలో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పసుపు, కుంకుమతో స్నపన తిరు మంజన సేవను వైభవోపేతంగా జరిపించారు. సేకరించిన పుట్ట మన్నును తొమ్మిది పాత్రల్లో నింపి అంకారార్పణ కార్యక్రమాన్ని నయనానందకరంగా జరిపించారు. పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, పరిషదక్షిణ, మృత్సంగ్రహణం, హోమం, తదితర కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు, పుష్పాలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి.

నేటి కార్యక్రమాలు

కల్యాణోత్సవంలో భాగంగా రెండవ రోజు జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆరాధన, శ్రీస్వామి వారికి సహస్ర నామార్చన. ఏడు గంటలకు బాల భోగం నివేదన, నిత్య హోమం, బలిహరణ, తీర్థ ప్రసాద గోష్ఠి. ఎనిమిది గంటలకు చతుస్థానార్చనలు. 10 గంటలకు ధ్వజారోహణ, నీరాజన మంత్ర పుష్పాలు. తీర్థ ప్రసాద గోష్ఠి. రెండు గంటలకు శ్రీస్వామి వారి గ్రామోత్సవం (ఊరేగింపు) అనంతరం ఆరాధన. 6 గంటలకు సాయంకాలార్చన, చతుస్థానార్చనలు, నిత్యోపాసన, బలిహరణ. 8 గంటలకు స్వామి వారి రాయబారోత్సవం (ఎదుర్కోలు ఉత్సవం). 9.15 గంటలకు శ్రీస్వామి వారి దివ్య తిరు కల్యాణ మహోత్సవం. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 9 గంటలకు శ్రీలలితా విష్ణు సహస్ర నామ పారాయణం, 11 గంటలకు శ్రీఅన్నమాచార్య సంకీర్తన విభావరి, మధ్యాహ్నం ఒంటి గంటకు స్వామి వారి తిరువీధి ఉత్సవంలో భాగంగా కోలాటం ప్రదర్శన.

ఆలయాల్లో చోరీలు చేసే ఆటోడ్రైవరు అరెస్టు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అందరూ దేవుడి గుడికి వెళ్లి మొక్కులు తీర్చుకునేందుకు హుండీల్లో డబ్బులు వేస్తే ఇతగాడు హుండీలు దొంగిలించేందుకు ఆలయాలకు వెళుతుంటాడు. జిల్లాలో పలు ప్రాంతాల్లో చిన్న చిన్న ఆలయాల్లో హుండీలు కొల్లగొడుతున్న దొంగను రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. స్టేషన్ ఆవరణలో గురువారం విలేకరులకు సెంట్రల్ డీఎస్పీ కె.రమేష్ బాబు, మూడో పట్టణ సీఐ వి.అప్పారావు, ఎస్సై వి.అప్పలరాజు ఆ వివరాలు తెలిపారు. కాకినాడ జిల్లా తొండంగి మండలంలోని అసూరు గ్రామానికి చెందిన పారేపల్లి బాబి రాజమహేంద్రవరం గోకవరం బస్టాండులో టీ దుకాణంలో పనిచేసేవాడు. ఆ తర్వాత ఆటో డ్రైవరుగా మారాడు. కొన్నాళ్లకు సులువుగా డబ్బు సంపాదించేందుకు ఆలయాల్లో హుండీలు చోరీ చేయాలన్న తలంపు వచ్చింది. అందుకు పథక రచన చేసుకుని ఆలయాల గేట్లు కోసేందుకు కట్టర్ కొన్నాడు. దొంగతనం చేసేందుకు నిర్దేశించుకున్న ఆలయానికి పగటి సమయంలో భక్తుడిలా వెళ్లి ఆనుపానులు పరిశీలించేవాడు. రాత్రి సమయంలో ఆ ఆలయం సమీపంలో ఆటోను ఆపి ఎవరికీ అనుమానం రాకుండా చూసుకుంటాడు. జన సంచారం తగ్గిన తరువాత ముందే సిద్ధం చేసుకున్న ఎలక్ట్రికల్ కట్టర్‌తో ఆ గుడి కరెంటు ఉపయోగించుకుని గేటు కట్ చేస్తాడు. లోపల హుండీ తాళాన్ని కూడా కోసి డబ్బు మొత్తం దోచుకుని వెళతాడు. దొంగతనానికి వెళ్లినా ఇతడికి ఉన్న దైవ భక్తి కారణంగా ఆలయంలో విగ్రహాలపై ఉండే వస్తువులను ముట్టుకునేవాడు కాదు. ఇలా రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో నాలుగు ఆలయాల్లో, కోరుకొండ పరిధిలో ఒక ఆలయంలో హుండీలు దోచుకున్నాడు. ఆలయాల్లో వరుస దొంగతనాలతో ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు క్రైం అదనపు ఎస్పీ అర్జున్ పర్యవేక్షణలో దర్యాప్తు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని గుర్తించారు. లింగంపేట వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా నిందితుడిని అరెస్ట్ చేశారు. హుండీల డబ్బుతో గోవా వెళ్లి జల్సా చేయాలని కొంత డబ్బు దాచినట్టు విచారణలో నిందితుడు పోలీసులకు చెప్పాడు. నిందితుడి నుంచి రూ.95 వేలు నగదు, నేర పరికరాలు, ఆటో, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లు బి.విజయకుమార్, పి.మహేష్‌కుమార్, కె.పవన్‌కుమార్, కె.శ్రీనివాసులను ఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న త్రీటౌన్ పోలీసులు

దళితులను విద్యకు దూరం చేయొద్దు

ప్రాథమిక పాఠశాల తరలింపుపై ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన

తాళ్లపూడి (కొవ్వూరు): ఎస్సీ ఏరియాలో ఉన్న ప్రాథమిక పాఠశాలను తరలిస్తే తమ పిల్లలు విద్యకు దూరం అవుతారని దొమ్మేరు ఇందిరమ్మ కాలనీవాసులు వాపోయారు. కొవ్వూరు మండలం దొమ్మేరు ఇందిరమ్మ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(స్పెషల్)ను వేరే పాఠశాలలో విలీనం చేయడంపై గ్రామస్తులు గురువారం కొవ్వూరులోని మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి నాగరాజు, సర్పంచ్ తానేటి కుమారి, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు రౌతు రాణి, పాసిపో బేబి, అనిమిల్లి జ్ఞానేంద్ర ఎంఈవో కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు చదివేవారు 33 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పాఠశాల విద్యాకమిటీ, విద్యార్థుల తల్లిందండ్రులు, సర్పంచ్ పాఠశాలల తరలించరాదని చెప్పినప్పటికీ, తాము అనుకూలంగా సంతకాలు చేసినట్టు అధికారులు నివేదిక పంపడం ఏంటని ప్రశ్నించారు. 1930లో ఏర్పడిన ఈ పాఠశాల ద్వారా దళితుల పిల్లలు విద్య నేర్చుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఫౌండేషన్ స్కూల్ చేయడం వల్ల ఇక్కడ కేవలం 1,2 తరగతులు మాత్రమే మిగులుతాయని తెలిపారు. ఎంఈవో బి స్వరూప్‌కు వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వరిగేటి సుధాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు జి.సునీల్, కె.రాజేష్, ఎ.లక్ష్మి, యాగంటి శాంతకుమారి పాల్గొన్నారు.



ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

వాయిదాల పర్వంలో సత్రం భూముల కౌలు వేలం

అధికార కూటమి పార్టీ ఒత్తిడులే కారణమా?

తొండంగి: పిఠాపురం శ్రీసంస్థానంకు చెందిన తొండంగిలోని 478.76 ఎకరాలకు, రాజమహేంద్రవరం నాళం వారి సత్రంకు చెందిన శృంగవృక్షంలోని దాదాపు 268.64 ఎకరాలకు కౌలు వేలం ప్రక్రియ వాయిదాలు పడుతూ వస్తోంది. వీటికి మూడేళ్ల కౌలు పూర్తికావడంతో కౌలు వేలం నిర్వహించాల్సి ఉంది. ఏప్రిల్ 29న శృంగవృక్షం పంచాయతీ కార్యాలయంలో నాళం వారి సత్రం భూముల కౌలు వేలం నిర్వహించాల్సి ఉండగా బకాయిలు వసూళ్లు తదితర కారణాలతో వాయిదా వేశారు. తొండంగిలో శ్రీసత్రం భూములకు కూడా గత నెల 23న కౌలు వేలం నిర్వహించాల్సి ఉండగా పలు కారణాలతో ఈ నెల ఆరుకు వాయిదా వేశామని అప్పట్లో ఈవో శ్రీరాములు ప్రకటించారు. టీడీపీ మహానాడుకు జనాన్ని తరలించేందుకు భూముల కౌలు వేలం దక్కింప జేస్తామని ప్రకటించి వేలం వాయిదా వేయించినట్టు ఆరోపణలు వచ్చాయి. కాగా మళ్లీ శ్రీసత్రం భూముల కౌలువేలంకు సంబంధించి దండోరా వేయలేదని ఈ నెల 20కి వాయిదా వేసినట్టు గురువారం రాత్రి సాక్షికి తెలిపారు. కౌలు వేలం ప్రక్రియను వాయిదాల పర్వం వెనుక అధికార కూటమిలోని పార్టీ హస్తం ఉన్నట్టు తెలుస్తోంది. వేలంలో కౌలు దక్కించుకుని సాగుకు సన్నద్ధమవుదామన్న రైతుల ఆశలకు గండి కొడుతూ వాయిదాలు వేస్తున్నారు. సాగులో ఉన్న రైతులు తక్కువకు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. త్వరగా కౌలు వేలం నిర్వహిస్తే సాగుకు సిద్ధమవుతామని, తద్వారా కౌలు ఆదాయం పెరుగుతుందని కౌలు వేలంలో పాల్గొనాలనుకుంటున్న రైతులు చెబుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నిడదవోలు రూరల్: పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు గురువారం తెలిపారు. అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన ఎజ్జిర్ల మధు కుమారుడు విక్రమ్ అనే ఇస్సాకు (19) చేపల చెరువుల వద్ద కాపలా ఉంటూ జీవనోపాధి పొందుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉండటంతో కొంతకాలంగా మానసిక ఆందోళనలో ఉన్న ఇస్సాకు ఈ నెల 3వ తేదీన నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన మేనత్త ఆబోతు మరియమ్మ ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం ఇస్సాకు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడటంతో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

అమలాపురంలో సైబర్ మోసం

గ్రీజు డబ్బా కొనుగోలు పేరుతో రూ.24 వేలకు టోకరా

అమలాపురం టౌన్: ఓ సైబర్ నేరగాడు గ్రీజు డబ్బా కొనుగోలు పేరుతో షాపు యజమానికి రూ.24 వేలకు టోకరా వేసిన ఉదంతమిది. స్థానిక శ్రీనివాస ఏటిగట్టు ప్రాంతంలో బ్రహ్మం రేడియేటర్స్ అండ్ మొబైల్ షాపు యాజమాని టి.సత్యనారాయణకు ఓ ఆగంతకుడు బుధవారం సాయంత్రం హిందీలో మాట్లాడుతూ ఫోన్ చేశాడు. 5 కేజీల గ్రీజు డబ్బా కావాలని ధర అడిగాడు. రూ.వెయ్యి అని చెప్పగానే మీ షాపునకు మా మనిషిని పంపుతాను, డబ్బా అతని చేతికివ్వమని ఆగంతకుడు షాపు యజమానికి చెప్పాడు. మీకు రూ.వెయ్యి ఫోన్ పే చేస్తున్నానని చెప్పి కొద్దిసేపటికి మీ అకౌంట్లో పొరపాటున రూ.10 వేలు సొమ్ము వేశాను. మీకు ఇవ్వాల్సిన రూ.వెయ్యి తీసుకుని మిగిలిన రూ.9 వేలు మీ ఫోన్‌కు ఓ స్కానర్ పంపిస్తున్నాను, దానికి డబ్బు పంపమని చెప్పాడు. అకౌంట్‌లో డబ్బు పడిందో లేదో చూడకుండా కేవలం మెసేజ్‌కు స్పందించిన షాపు యాజమాని రూ.9 వేలు ఆగంతకుడు పంపించిన స్కానర్‌కు పంపించేశారు. తర్వాత కొద్ది సేపటికి మీ ఫోన్‌కు మరో రూ.15 వేలు పొరపాటున పంపించాను, ఆ డబ్బును కూడా స్కానర్‌లో పంపించండని మెసేజ్ పెట్టాడు. నేనెక్కడో ఉన్నాను. ఇక్కడ డబ్బు ఫోన్ పే చేయాలని, అర్జంటుగా నాకు డబ్బు పంపించాలని షాపు యాజమానిని ఆగంతకుడు నమ్మించాడు. షాపు యాజమాని రూ.15 వేలు కూడా స్కానర్ ద్వారా పంపించేశారు. దీంతో మొత్తం రూ.24 వేలు ఆగంతకుడు పంపిన స్కానర్‌కు పంపించారు. తర్వాత ఫోన్ పేలో అకౌంట్ బ్యాలెన్స్‌ను చెక్ చేసుకుంటే రూ.24 వేలు డ్రా అయినట్లు కనిపించింది. దీంతో తాను సైబర్ మోసానికి గురైనట్టు షాపు యజమాని గ్రహించి సైబర్ పోలీసులకు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు.

